పీజీ ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదల

పీజీ ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

కామారెడ్డి, సెప్టెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో పీజీ ద్వితీయ సంవత్సరం ఫలితాలను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ విడుదల చేశారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూలోని 8 కోర్సుల్లో రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలైనట్లు తెలిపారు. 85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ, పీజీ అడిషనల్ కంట్రోలర్ ప్రొఫెసర్ సాయిలు, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి కిష్టయ్య, అడిషనల్ కంట్రోలర్స్ మానస, రాములు తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

లింగంపేట, సెప్టెంబర్ 12 : మండలంలోని పోతాయిపల్లి గ్రామానికి చెందిన డీజే నిర్వాహకులను తహసీల్దార్ నరేందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అరుణ్ తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం రోజున డీజేల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. డీజేలు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యగా డీజే యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనూ నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డీజేలకు అనుమతులు లేవు...

నస్రుల్లాబాద్ మండలం దుర్కిలో మండపం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏఎస్సై వెంకట్రావ్

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 12 : ఎలాంటి అనుమతులు లేవని ఏఎస్సై వెంకట్రావ్ అన్నారు. మండలంలోని దుర్కి, నస్రుల్లాబాద్, బొమ్మన్‌దేవ్‌పల్లి, నాచుపల్లి గ్రామాల్లోని మండపాల నిర్వాహకులకు ఆయన సూచించారు. నస్రుల్లాబాద్ మండలంలోని ముగ్గురు డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా డీజేలు పెట్టినట్లయితే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని ఆయన అన్నారు.

తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి

నర్వ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

నిజాంసాగర్, సెప్టెంబర్ 12 : మహ్మద్‌నగర్ మండల నర్వ గ్రామాన్ని ఎంపీడీవో గంగాధర్ గురువారం సందర్శించారు. శానిటేషన్, వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి బలరాంను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 12 : రక్తహీనతపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడో జాతీయ పోషణ్ మాసంలో భాగంగా టేక్రియాల్‌లోని కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు రక్తహీనత పరీక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కిశోర్ బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో కిశోర్ బాలికలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 363 మంది విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, వైస్ చైర్‌పర్సన్ అనిత, బీడబ్ల్యూ బావయ్య, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, వైద్యశాఖ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కామారెడ్డి, సెప్టెంబర్ 12 : 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా కేంద్రంలోని లయోల స్కూల్‌లో ఖోఖో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు గురువారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, టోర్నమెంట్ కన్వీనర్ పాల్వంచ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ రంగ వెంకటేశ్వర్‌గౌడ్, సెక్రటరీ రాము, దుస్తుల స్పాన్సర్ నాగేశ్వర్‌రావు, నిజామాబాద్ జిల్లా కోచ్ మేనేజర్లు నరేశ్‌రెడ్డి, నాగరాజు, సంతోష్, మహ్మద్ అతీకుల్లా, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ చైర్మన్ బిల్లా అనిల్, జీవీ భూమారెడ్డి, నోముల మధుసూదన్ రెడ్డి, నీల రాజు, కొర్ర వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వర్‌రావు పంపిణీ చేసిన దుస్తులతో క్రీడాకారులు

నిమజ్జన మార్గాన్ని పరిశీలించిన అధికారులు

లింగంపేట, సెప్టెంబర్ 12 : మండల కేంద్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. పెద్దవాగులో వినాయక విగ్రహాల నిమిజ్జనం సందర్భంగా వాగులోకి వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. విగ్రహాలకు విద్యుత్ తీగలు తగలకుండా సరి చేయాలని చెప్పారు. శోభాయాత్ర మార్గంతోపాటు నిమజ్జన స్థలాన్ని తహసీల్దార్ నరేందర్, సీఐ రవీందర్, ఎస్సై అరుణ్, ఏఎస్సై ప్రకాశ్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పవన్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ట్రాన్స్‌కో సిబ్బంది ఆదిరెడ్డి తదితరులు పరిశీలించారు.

వినాయక నిమజ్జన మార్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి

మాచారెడ్డి, సెప్టెంబర్ 12 : ఈ నెల 9న పాల్వంచ జడ్పీహెచ్ఎస్‌లో ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్వంచ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన గెరుగంటి ప్రణీత, ముదుగల్ల వినోద్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లోని మౌలాలిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని విద్యార్థులకు సూచించారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

నిరసన తెలియజేస్తున్న గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

కామారెడ్డి, సెప్టెంబర్ 12 : లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌహాన్ వినోద్ నాయక్, ప్రధాన సెక్రెటరీ బాలాజీ, నాయకులు భాస్కర్, వెంకట్, గణేశ్ నాయక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పరిశీలన

కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ

కామారెడ్డి, సెప్టెంబర్ 12 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో పాత రాజంపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు మల్లయ్య ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ ఆ ఇంటిని గురువారం పరిశీలించారు. త్వరలో ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ రూప రవికుమార్, మమత సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నరేందర్

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 12: నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. లింగం పేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న నరేందర్‌కు నాగిరెడ్డిపేట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు విష్ణు, నాగయ్య శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

రామారెడ్డి, సెప్టెంబర్ 12 : సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు రోడ్డు భద్రత, నిబంధనలపై ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు విద్యార్థులు అర్థమయ్యేలా రోడ్డు భద్రత, నిబంధనల గురించి వివరించాలని సూచించా రు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆర్డీవో

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రంగనాథ్‌రావు

రామారెడ్డి, సెప్టెంబర్ 12 : సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామాన్ని ఆర్డీవో రంగనాథ్‌రావు గురువారం సందర్శించారు. గ్రామంలో ప్రాజెక్టు నిర్మాణం (టన్నెల్) కోసం వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. అనంతరం రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ గంగాసాగర్, ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ ఆర్ఐ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

లింగంపేట, సెప్టెంబర్ 12 : లింగంపేటలోని నాగన్న బావి వద్ద చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను డీఆర్డీవో సురేందర్ గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కూలీలు వాకింగ్ ట్రాక్‌లో మట్టి రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నాగన్న బావిలో పేరుకు పోయిన నాచును తొలగించే పనులను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పక్కన ఉన్న స్థలంలో మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్‌తోపాటు ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

పాఠశాల భవనం పరిశీలన

మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

లింగంపేట, సెప్టెంబర్12: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల కళాశాల ఏర్పాటుకు ప్రిన్సిపాల్‌తో కలిసి అంబేద్కర్ సంఘం నాయకులు పరిశీలించారు. లింగంపేట మండలానికి మంజూరైన బాలికల గురుకుల పాఠశాలను కామారెడ్డి మండలం దేవున్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్నారు. భవనం అనుకూలంగా లేని కారణంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యతోపాటు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మకు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వనితతో కలిసి అంబేద్కర్ సంఘం నాయకులు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గురుకుల పాఠశాల భవనం ఏర్పాటుకు అనువుగా ఉందని వెల్లడించారు. భవన పరిశీలన నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బబ్లూ, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నాయకులు నెల్లూరి గంగారాం, నాగ్లూరి సాయిలు, ద్యామని భూపతి, లెగ్గల రాజు, రాపర్తి సాయిలు తదితరులు ఉన్నారు.

చదువుతోనే మంచి జీవితం

సోమిర్యాగడి తండా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 12: చదువుతోనే మంచి జీవితం లభిస్తుందని ఎంపీవో ప్రకాశ్ సూచించారు. ఎల్లారెడ్డి మండలం సోమిర్యాగడితండా గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. పాఠశాల హాజరుపట్టికను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఎటువంటి వ్యాధులు రావన్నారు. వర్షాకాలం ముగిసే వరకు వ్యాధులు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ, ఏపీవో, అంగన్‌వాడీన్వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశావర్కర్ తదితరులున్నారు.

ఆరోగ్య శిబిరాల ఏర్పాటు

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 12: మండలంలోని గోపాల్‌పేట, వెంకంపల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందించినట్లు వైద్యాధికారి సృజన్‌కుమార్ తెలిపారు. శిబిరంలో 140 మందికి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వారిలో ఐదుగురికి జ్వరం ఉండడంతో.. వైద్యం అందించి మందులను ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో ఏఐహెచ్‌పీ విజయ్, దేవీదాస్, అపర్ణ, జ్యోతి, ఏఎన్ఎంలు మణెమ్మ, వసంత, మంగమ్మ, సువర్ణ, సుమల, సూపర్‌వైజర్ సునంద, ఆశవర్కర్లు, హెల్త్ స్టాఫ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, NARMALA PRABHAKAR S/o NARMALA SANJEEVA REDDY R/o. H.No: 1-92, Vill:Kondur, Mdl: SiriKonda, Dist. Nizamabad -503165, T.S. Changed My Name As " NARMALA PRABHAKAR REDDY "

NTZ-340281

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

కిషన్

రామారెడ్డి, సెప్టెంబర్ 12 : మండల కేంద్రంలో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులకట్ట కిషన్(49) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి కూడా బాగా లేదు. దీంతో మనస్తాపం చెంది తన ఇంట్లో ఉన్న దేవుని గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్లను నరికితే పట్టాలు రావు.. కేసులు నమోదు

ఎఫ్‌డీవో రామకృష్ణ

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 12 : అక్రమంగా చెట్లు నరికేసి, అటవీ భూమిని ఆక్రమిస్తే వాటికి పట్టాలు రావని, కేసులు మాత్రం నమోదు అవుతాయని ఎఫ్‌డీవో రామకృష్ణ హెచ్చరించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని హాజీపూర్ తండాకు చెందిన కొందరు గ్రామస్తులు భవిష్యత్తులో వారికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇస్తామని ఆశతో ఐదు ఎకరాల అటవీభూమిని ఆక్రమించి, అందులోని చెట్లను నరికివేశారన్నారు. వీరిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం 13 డిసెంబర్ 2005 వరకల్లా ఎవరైతే అక్యుపేషన్‌లో ఉన్నారో వారికి మాత్రమే గుర్తింపు పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతేకాని ప్రస్తుతం కొత్తగా చెట్లను నరికి భూమిని ఆక్రమించినవారికి ఎటువంటి గుర్తింపు పత్రాలు రావన్నారు. అటవీభూమిని ఆక్రమించడం, చెట్లను నరకడం చేయవద్దన్నారు. అనంతరం ఆయన హాజీపూర్ తండాకు వెళ్లి చెట్లు నరికిన స్థలాన్ని పరిశీలించారు. ఎఫ్ఆర్‌వో ఓంకార్, అటవీశాఖ సిబ్బంది తదితరులున్నారు.

హాజీపూర్ తండా వద్ద చెట్లు నరికేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో రామకృష్ణ

మండల సీఆర్పీకి గురుబ్రహ్మ పురస్కార్

పురస్కారాన్ని అందుకుంటున్న మహ్మద్

రామారెడ్డి, సెప్టెంబర్ 12 : రామారెడ్డి ఎమ్మార్సీలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్‌కు గురుబ్రహ్మ పురస్కార్ అందజేశారు. సీఆర్పీ విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బడిబయటి పిల్లలను బడిలో చేర్పించడం, ఆవాస ప్రాంతాల్లో బడులు ఏర్పాటు చేయించడం, పలు విశిష్ట సేవలకుగాను ఆయనను సర్వేజన సుఖినోభవంతు ఎన్జీవో హైదరాబాద్ వారు జస్టిస్ రిటైర్డ్ జడ్జి చంద్రయ్య చేతుల మీదుగా సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు మందాడి కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటచారి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.